# ముందు వెనకలు మిధ్య
# చిన్న పెద్దలు తధ్యం

రఘునాధరావుకి అంత అందమయిన పెండ్లాముందని నే నెరుగను. ఆఫీసుకి పెద్ద అధికారిగా ఉంటే యిదే పేచీ, ఎవ్వరూ ఇలాంటివి చెప్పరు. మనసిచ్చి మాట్లాడరు. నన్ను మెప్పించడానికీ నా వద్దనుండి మంచి రిపోర్టు పొంది ప్రమోషనొచ్చేలాగు, ముఖస్తుతి చేస్తూ మాట్లాడతారు. ఆఫీసులో వారు ముఖస్తుతికి కరగని వాడెవరు? అదే ఇష్టం మనిషికి, క్రింది ఉద్యోగులు ముఖస్తుతి సాగించాలనే కోరతారు వారూ తదనుగుణ్యంగానే సాగిస్తారు. ఇదొక క్రీడలాంటిది. అంతటా కొనసాగుతూ వుంటుంది వాతావరణంలాగు. వాతావరణం గురించి ప్రతివారూ మాట్లాడుకున్నా, ఎవరు చేసేది ఏమీ లేనట్లుగానే ముఖస్థితి జరుగుతూనే వుంటుంది. ఎవ్వరూ చేసేది ఏమీ వుండదు.

అమ్మాయి 'రోజా' (సరోజ కాబోలు) పుట్టినరోజు జరుపుకుంటున్నది, రమ్మనవల్సిందిగా చాలా వత్తిడి చేశాడు రఘునాధరావు. సాధారణంగా క్రింది ఉద్యోగుల ఇండ్లకు వెళ్ళను నేను. వెళ్ళడం మంచిది కాదు కూడా, వెళ్ళడం మొదలిడితే అందరిండ్లకీ వెళ్ళాలి. లేకపోతే రాజకీయాలు రేగుతాయి.

“నేనిప్పుడు మీకు చెప్పలేను. కాని మీరొస్తే ఆమె సంతోష పడుతుంది. అది చాలా ముఖ్యం” అన్నాడు రఘునాధరావు. నాకిది వింతగా తోచింది. కుతూహలం రేగింది. సరేనన్నాను.

ఆరోజు సాయంత్రం ఐదింటికొచ్చాడు రఘునాధరావు. రండి వెడదామన్నాడు. ఇద్దరు నా కార్లో బయలుదేరాము. నలుగురయిదుగురు ఆఫీసు వాళ్ళున్నారు. నే లోనికి రాగానే సరదాగా, బిగ్గరగా మాట్లాడు కుంటున్నవారు, కాలే బొగ్గులలో నీళ్ళు పడ్డట్టు మెదలకుండా వున్నారు. లేచి నమస్కారాలు పెట్టారు. కుశల ప్రశ్నలయ్యాక, నన్ను వెనకాల మండువాలో వేసిన పడక కుర్చీలలో కూర్చోపెట్టాడు. తినేటందుకు పదార్థాలు తెచ్చి పెట్టింది అతని భార్య. నమస్కరించింది, చిరునవ్వు నవ్వింది. మీరు రావడం గొప్ప విషయం అంది. రోజాని చూపింది.

“అమ్మాయికి సంగీతం నేర్పిస్తున్నారా” అన్నాను. రఘునాధరావు, భార్య ఒకరి మొహాలొకరు చూచుకున్నారు. అతను తల ఊపాడు. ఆమె నవ్వింది.

“దానికేం సంగీతంలెండి” అంది అమె. 'రోజా' ఆమెకేసి కోరగా చూసింది. నా కర్థం కాలేదు ఎందుకో.

“ఇంట్లోనే చదువు చెప్పిస్తున్నా” అన్నాడు రఘునాధరావు.

“బాగుంది” అన్నాను.

“ఆయనే చదువు చెప్పేది” అంది భార్య.

“కాఫీ తీసుకురా ప్రమీలా అన్నాడు రఘు.

అవీ ఇవీ చెప్పుకున్నాక నేను లేచాను. థ్యాంక్స్ చెప్పి, కారుదాకా వచ్చి సెలవు తీసుకున్నాడు రఘునాధరావు. అప్పుడు తెలిసింది ప్రమీల చాల అందమయిందని, యాభైయ్యో పడిలో బడ్డాక అన్య స్త్రీల చక్కదనం మెచ్చుకుంటే ఆక్షేపణ వుండనక్కర్లేదను కుంటా. మన వయస్సుతో బాటు చక్కదనం గురించిన ఊహలు కూడా మారుతుంటాయను

కుంటా. పదేళ్ళ క్రితం నాకు కాస్తంత బొద్దుగా గుండ్రనయిన అవయవాలుండి నిండుగా, ఒకటి రెండు వంపులు మాత్రం స్ఫుటంగా కనబడుతూ వుండే వారిని మెచ్చుకునేవాడిని. మరిప్పుడు నేను లావైపోయాను. వయస్సు మళ్ళడంతో సంక్రమించే స్తబ్దత, గుండ్రదనం, అన్ని అవతారాలూ అబ్బినాయి కాబోలు. ఇప్పుడు నాకు పల్చగా సన్నగా, మెడకింద ఎముకలు కనబడుతూ, కోణాలుగా కనబడే వంపులు చీర మడతలలోంచి కనబడుతూ రైలు పట్టాలు వంగినట్లు, సీసం కరిగి బొమ్మగా అయినట్లు పల్చగా, నీరసంగా కనబడే స్త్రీ అంటే ఇష్టం. ప్రమీల అలాంటిది. సన్నగా వున్న వారి కళ్ళల్లో కనబడే ఒక తృష్ణ, ఆకలి– ఆమె కళ్ళల్లో వుంది. భూకంపం జరిగాక భూమిలో పడ్డ బీటలలో ఒక బీటగా కనబడుతుంది ప్రమీల. భూమిలో వుండే ఆకర్షణ శక్తే ఆమెలోనూ వున్నట్లనిపించింది. కంటి రెప్పలు పల్చటి నల్లదారాలు. కాని ఎదురుగా వున్న వాడిని కట్టిపడేసేటంతటి గట్టిదారాలవి. కాలేజీలో చదువుకున్న రోజుల్లో బర్న్స్ కవి గేయాలు పాఠ్యభాగంగా వుండేవి. ఆ కవి స్త్రీత్వాన్ని 'ఒక గుడ్డపీలిక–ఎముక– పిడికెటి జుట్టు'గా వర్ణించాడు. ప్రమీలని చూసినప్పుడు ఆ వర్ణన జ్ఞప్తికొచ్చింది. జుట్టుకూడా ఊడిపోయి, పిడికెటి జుట్టుగా వుండిపోయింది. అలా వుండటమే ఆమెకి యెంతో శోభనిచ్చింది. ఆధునిక యుగంలో ప్రచారంలో కొస్తున్న చక్కదనపు పద్ధతుల్లో, ఇదొక రకం నా కిష్టం. రఘునాధరావుకి మంచి రిపోర్టిచ్చి, ప్రమోషన్ లభించే అవకాశం కలగజెయ్యాలని లోలోన నిశ్చయించుకున్నానని చెప్పివెయ్యడం భావ్యం.

మిగతా ఉద్యోగులు చెయ్యనిపని ఒకటి చేస్తాడు రఘునాధరావు. ఆఫీసుకి ఒక గంట ముందుగానే వచ్చేస్తాడు. ఆఫీసు అయ్యాక మరో గంటుండి పని చూసుకుని యింటికెడతాడు. సాయంత్రం నాలుగింటికే 'రోజా'ని ఆఫీసులో దించుతారెవరో. ఆమెతో ఆడుకుంటూ వుంటాడు. రోజా వయస్సు పన్నెండు, పదమూడు మించదేమో. బొద్దుగా వుంటుంది. మంచి ఛాయ. అందమయిన ముక్కు. ముక్కుకీ పై పెదవికీ కాస్తంత దూరం. అదొక అందం ఆకర్షణీయమైన మొహం. మరి రెండు మూడు ఏళ్ళల్లో అవయవాల అస్పష్టత సర్దుకుని, రావల్సిన క్రమం, నిండుదనం తెచ్చుకుంటాయి. ప్రస్తుతం చాకలి తెచ్చిన ఇస్త్రీ బట్టల మూటలా, కొత్తగా, తీరువు లేకుండా కనబడుతుంది. రఘునాధరావుకి కూతురంటే అంత ఇష్టం కాబోలు. ఆమెతోనే కబుర్లు, ఆటలు, ముద్దులు. చాలా భాగం రోజా తండ్రితో ఆఫీసులోనే గడుపుతుంది. మొదట్లో తోటి ఉద్యోగులు కొంత ఆక్షేపణగా మాట్లాడుతూ వచ్చినా, తరువాత తరువాత అలవాటయిపోయి, రోజాని కూడా ఆఫీసుకు ఒకదాన్నిగా స్వీకరించి, సర్దుబాటు చేసుకున్నారు.

ఆ రోజు రఘునాధరావు ఆఫీసుకి రాలేదు, అతనితో జరగవల్సిన పని ఒకటుంది. అతను శెలవు చీటీ పంపలేదు. అతని డ్రాయర్లో కొన్ని కాగితాలున్నాయి. డ్రాయరు తాళం చెవి అతని దగ్గరుంది. రంగారావుని అతనింటికి వెళ్ళి తాళం చెవి తెమ్మని పంపించాను. రంగారావు మధ్యాహ్నం ఒంటిగంట కొచ్చాడు.

"రోజాని గదిలో పెట్టి తాళం వేసిందట అతని భార్య. తాళంచెవి ఇవ్వనందట. భార్యతో తగవులాడుతున్నాడు. బయటకి పిల్చి తాళం చెవి తెచ్చానండి. ఇదిగో" అన్నాడు రంగారావు.

"ఎందుకు గదిలోపెట్టి తాళం వెయ్యడం?"

"ఏమోనండి. ఈయన రోజా కూతుర్ని ఆఫీసుకి తేవడం ఆమెకిష్టం లేదట"

అని, రఘునాథరావు చెయ్యవల్సిన పని పూర్తి చేసొస్తానని వెళ్ళాడు రంగారావు. మరో పదినిమిషాలలో రఘునాథరావే వచ్చాడు నా గదిలోకి.

అతని కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. రుమాలతో తుడిచేసి దుఃఖం కనిపించకుండా యత్నిస్తున్నాడు.

నా ఫ్లాస్క్‌లోది కాస్త టీ పోసి త్రాగమన్నాను.

"నే నిప్పుడు మీకు చెప్పలేను" అన్నాను. ఒకమారు 'జ్ఞాపకం వుందాండి?' అని మొదలెట్టాడు.

తల ఊపాను.

"ఆలశ్యమయింది క్షమించాలి. నా సొద చెప్పి విసిగించలేను, క్షమించండి" అని లేవబోయాడు.

"ఫరవాలేదు చెప్పు యింకా పావుగంటుంది రెండుకి" అన్నాను.

"రోజా అంటే నా కిష్టం ఒక్కతే పిల్ల. పిల్లను విడిచి క్షణం వుండలేను. అది ప్రమీలకి గిట్టదు. దాన్ని ఎక్కడికీ తీసుకెళ్లడానికి వీల్లేదంటుంది. దానితో ప్రేమ చూపుతూ, మసలకూడదుట. ఈ పూట ఆఫీసుకు తీసుకురాకుండా రోజాని గదిలోపెట్టి తాళం వేసింది. తాళం చెవి ఇమ్మన్నాను ఇవ్వనంది, తలుపు పగలకొడతానన్నాను. పెనుగులాటయింది. నలుగురూ పోగయ్యారు. రంగారావు వచ్చాడు. తాళంచెవి దొరికింది. తీసి రోజాని తీసుకొచ్చాను."

కాసేపు అతనేమీ మాట్లాడలేదు. ఇదంతా వింత వృత్తాంతంగా తోస్తోంది. తండ్రి కూతురుతో ఆపేక్షగా వుండి, ముద్దులాడితే తల్లికిష్టం లేదు వల్ల కాదంటుంది. ఇద్దరికీ ఎడబాటు జరపడానికి చూస్తుంది. ప్రకృతికి విరుద్ధం ఆమె మనస్తత్వం, కాని కూతుర్ని ఆఫీసుకి తీసుకురావడం, క్షణం వదలి వుండలేకపోవడం కూడా. కాస్తంత అసహజంగా కనబడసాగింది చాలామందికి. ఆఫీసు పనయ్యాక ఇంటికెళ్ళి, పిల్లలతో కాలక్షేపం చెయ్యడం మామూలు నేను అలా చేసేవాణ్ణి. ఎవరయినా అంతే, ఓ వేళ ఒక్కతే కూతురవడం మూలాన గారాబంవల్ల, ఆ పిల్లని ఆఫీసుకు తీసుకొస్తున్నాడని సరిపెట్టుకోవడంలో తప్పు లేదనుకుంటా. ఏమయినా, ఇరువురి ప్రవర్తనా, కాస్తంత అసాధారణంగా అసహజంగా వుందనుకోక తప్పదు.

"నాకూ రోజాకి ఏదో వుందంటుంది. ఐదారు మాసాలుగా మరీను రోజా పెద్దమనిషయినప్పటినుంచి" అని రఘునాథరావు మొహం తిప్పేసుకుని, వెడతానని లేచి వెళ్ళిపోయాడు. నాకు యేమనాలో యేం చెయ్యాలో తెలిసింది కాదు. నేను మనశ్శాస్త్రం చదివిన వాణ్ణికాను. కాని అది చదువుకుని, పై దేశంలో పరిశోధనలు చేసి డాక్టరేట్ డిగ్రీ పొంది బొంబాయిలో ఒక కాలేజిలో మనశ్శాస్త్రం ప్రొఫెసర్‌గా వుంటున్న ఆచారి నా స్నేహితుడు. చిన్నప్పుడు ఈ శాస్త్రానికి సంబంధించిన విషయాలెన్నో చెబుతుండేవాడు డాక్టరు కార్. పేరు ఆచారి– కాని డిగ్రీ పొందాక, 'ఆ' తీసేసి 'చార్' గానూ తరువాత 'చ' ని 'కా' చేసి 'కార్' గానూ వ్యవహరింపబడుతూ ఆ పేరే నిలిచిపోయింది అతనికి. అతను 'ఎడిసన్ కాంప్లెక్స్' 'తల్లిపట్ల బంధం' అందం గూర్చి చెప్పేవాడు. ఇది గ్రీసు దేశపు పురాణగాథ. 'ఎడిసన్' పుట్టగానే తండ్రి గండాన పుట్టాడని జోస్యులు నిర్ణయించడం వల్ల కొడుకుని ఎడారిలో వదిలెయ్యమని పంపించాడు తండ్రి. అక్కడ ఒక గొర్రెల కాపరి పెంచి పెద్దవాణ్ణి చేస్తాడు ఎడిసన్‌ను. కాని అతను పెద్దవాడయ్యాక

దేవవాక్కు చెప్పినట్లే యుద్ధానికెళ్ళి, తండ్రిని హత్యచేసి తల్లిని వివాహమాడతాడు. నిజం తెలిశాక తల్లి ఆత్మహత్య చేసుకుంటుంది. ఎడిసన్ కండ్లు పీకించేసుకుంటాడు. అదీ కథ. దీన్ని ఆధారంగా ఫ్రాయిడ్ అనే ప్రసిద్ధ మానసిక శాస్త్రజ్ఞుడు 'తల్లి బంధం' అన్న సిద్ధాంతం ప్రచారంచేసి కొన్ని మానసిక వ్యాధుల్ని కుదిర్చాడట. బాల్యంలో- రెండు మూడు సంవత్సరాలలోపు- మొగబిడ్డకి తల్లిపట్ల అనురాగం ఏర్పడుతుంది. తల్లి తన కే హాని రాకుండా కాపాడుతుంది. తల్లి తనది ఆమె అవయవాల పట్ల పరిచయం ద్వారా వచ్చే వాంఛ, జిజ్ఞాస రహిత మయిందే ననుకోండి- ఏర్పడుతుంది. కాని ఆమెని మరొక వ్యక్తి అంటె తండ్రన్నమాట. స్వంతం చేసుకోవడం గమనిస్తాడు వాడు పరాయివాడు శత్రువు. తనదయిన తల్లిని స్వంతం చేసుకుని, రాత్రుళ్ళు వాడుకుంటున్నాడు. కాబట్టి అతనిపట్ల పగ, ద్వేషమూ ఏర్పడతాయి. కాస్త జ్ఞానం వచ్చాక విషయం తెలిసికున్నాక తన రహస్యమైన వాంఛని, తల్లి బంధం అనే భావాన్ని- మనసులో అధోలోకంలోకి నెట్టివేస్తాడు. కాని ఆ వాంఛ అధోలోకంలో వుండి అనేక మార్గాలుగా అనేక విధాలుగా బయటపడి, చికాకు పరుస్తూ వుంటుంది. ఆ బంధం వత్తిడివల్ల మరొక స్త్రీని అందరికిమల్లే ప్రేమించలేడు. సంబంధం ఏర్పరచుకోలేక, ఏకాంతజీవి అవుతాడు. తల్లి చనిపోయినా కూడా, ఆమె ప్రతిమ బాల్యంలో జ్ఞాపకాలు, అతని జీవితాన్ని గతానికి కట్టిపడేసి, ప్రేమ బంధానికీ, దాంపత్య జీవితానికీ అంతరాయం కలిగిస్తాయి. దీనికి మందేమిటి? ఈ వైపరీత్యానికి గురయిన రోగిని, మైకంలో పడవేసి, బాల్యంలో జరిగిన అనుభవాలని జ్ఞప్తికి తెచ్చుకొని, పైకి వైద్యుడితో చెప్పివేసేట్టు చేసే గతం నుండి విముక్తుడౌతాడు- వ్యాధి కుదురుతుంది.

అట్లాగే, ఆడ శిశువుకి తండ్రిపట్ల బంధం ఏర్పడుతుంది. గ్రీసు పురాణగాథల్లో 'ఎలెక్ట్రా' అనే ఆమెకి తండ్రితో బంధం ఏర్పడిన కథ వుంది. దీన్ని 'ఎలెక్ట్రా కాంప్లెక్స్'- 'తండ్రి బంధం' అనవచ్చు. ఆ రకం బంధం 'రోజా' కి తండ్రిపట్ల ఏర్పడిందన్నమాట. కాని 'రోజా' ప్రవర్తన సహజమైందిగానే వుంది. ఆమెకి తండ్రిపట్ల- విశేషమైన అనురాగం వుందనలేము. తల్లిపట్ల తన స్వంతమైన తండ్రిని అనుభవిస్తున్న తల్లిపట్ల పెద్ద ద్వేషం వుందనలేము. 'రోజా' నాన్న రమ్మంటే వెడుతుంది. అమ్మ వద్దంటే మానెయ్యడానికి సిద్ధంగానే వుంది. తల్లిదండ్రుల మాట కాదనదు. పేచీ అంతా ప్రమీలలో వుంది. 'రోజా' లో లేదు. తన భర్త ప్రేమని ఈ పిల్ల- నిన్నకాక మొన్నటిపిల్ల పంచుకుంటోందన్న పగ, ద్వేషమూ ఆమెలో వున్నాయా? అది సహజమా? ఇదేదో 'ప్రమీలా కాంప్లెక్స్' కొత్త బంధంలా వుంది.

'దాని మొహం దానికి సంగీతం ఏమిటిలెండి" అంది ప్రమీల. అదంతా కూతురిపట్ల అసూయ. కూతురు అన్ని విద్యలూ అభ్యసించి, అన్ని కళలు సాధించి, ప్రయోజకురాలై, మంచి మొగుణ్ణి తెచ్చుకోవాలని కోరుతుంది ప్రతి తల్లీ. అసలు సంగీతం రాకపోయినా, మేష్టార్ని పెట్టించి, నేర్పించి అమ్మాయిని గొప్ప గాయకురాలుగా కొనియాడి, ప్రచారం చేసిన తల్లుల్ని ఎరుగుదును నేను. మరి ప్రమీల ఇదేం విపరీతం! అమ్మాయికి సంగీతం చెప్పించకూడదు, రాకూడదు- దాని మొహం. అతను మాత్రం- ఆ రఘునాధరావు మాత్రం అమ్మాయంటే ఆఫీసుకి కూడా తీసుకురావాల్సినంత విడ్డూరమైన ఆపేక్ష ఏమిటి? ఇంక అట్లా తీసుకురావడానికి వీల్లేదు అని- కేకేసి చెప్పనా? అనుకున్నాను.

చెప్పలేను, ఆ విషయం చెప్తుంటే అతనుపడ్డ బాధ, కళ్ళంట నీరు తిరిగిన వైఖరి, మరిచిపోలేను. అతని మనస్సుని గాయపరచలేను. ఒక రిద్దరు ఉద్యోగులు అమ్మాయిని తీసుకురావద్దని చెప్పమనే సూచించారు. అదంతా పై అధికారి సానుభూతి పొందడంకోసం. అతిశయోక్తిగా నాటకీయతతో మిళితంచేసి చెప్పడం– అంత అపారమైన ప్రేమ ఏమీ ఉండదు. ఫరవాలేదు, చెప్పండన్నారు వారంతా; ఆలోచించాను. నాలుగైదు నెలలయ్యాక, రఘునాథరావుని గదికి పిలిపించి చెప్పే అవకాశం ఏర్పడింది. 'రోజా' నాన్నతో ఆడుతూ గంతులేస్తూ బల్లమీద సిరాబుడ్డిని తోసేస్తే, సిరా అంతా కాగితాలమీద పడి కాగితాలు పనికిరాకుండా పోయాయి. రంగారావు చెప్తే చూశాను. రఘునాథరావుని నా గదికి రమ్మన్నాను. వచ్చాడు.

"అవి చాలా ముఖ్యమైన కాగితాలు. ధ్వంసం అయిపోయాయి ఇట్లాగైతే ఎట్లా?" అన్నాను. కొంచం ఆఫీసు హోదాతో వచ్చే భీకర కంఠంతో.

"పొరపాటే, క్షమించమంటున్నాను. అవన్నీ రాత్రంతా కూర్చుని కాపీలు తీస్తాను" అన్నాడు. ఇంకేమన్ను?

"ఐనా, ఇదేం బాగోలేదు. ఇంగ్లండ్‌లో టైమయ్యాక ఆఫీసులో ఒక్కక్షణం వుండరు పనివాళ్ళు. ఇళ్ళకి పోతారు, ఆఫీసు మూసేశాక కూడా గంటలతరబడి పనిచేసే అలవాటు మన వారికే. ఆ అలవాటుకి కారణం, సోమరితనం, ఒక పద్ధతిలో పన్లు సకాలానికి పూర్తిచేసే నేర్పరితనం లోపించడం వల్లనే ఇలా తయారయ్యాం అంటారు. మన ఆఫీసులో ఆ గొడవలు లేవనుకో. కొన్ని ఆఫీసులలో స్త్రీలు కూడా పనిచేస్తారు. ఆఫీసు మూశాక వారూ; వీరూ వుండిపోతే ఎన్ని పదంతులైనా పుడతాయి. అందుకని సాయంత్రం అవగానే గదులకి తాళాలు వేయించే ఏర్పాటు చేస్తున్నాను." అన్నాను ఒక్క బిగిని ముందుగా అనుకున్నవన్నీ యాకరువు పెడుతూ.

"అలాగేనండి, మూసెయ్యగానే వెళ్ళిపోతాను" అన్నాడు.

"రోజాని స్కూలులో చేర్పించరాదూ?" అన్నాను. "దానికి స్కూలంటే భయం. కొన్నిరోజులు పంపించి చూశాను. మేష్టారంటే భయం. తోటి పిల్లలంటే భయం. నేనూ తనతో కూర్చోవాలంటుంది."

"మొదట్లో అందరూ అలానే వుంటారు. అలవాటైనాక సర్దుకు పోతారు. ఈడొచ్చిన పిల్ల యిలా యిక్కడ ఆఫీసులో ఉంటే ఏం బాగుంటుంది? ఇంటిలో తల్లి దగ్గరే వుండి ప్రైవేటుగా చదువుకోవటం మంచిదిగా" అన్నాను.

"మీరు అలాగే అంటున్నారా?" అన్నాడు మొహం దిగులుగా పెట్టి.

"ఎవరన్నా అలాగే అంటారు. చదువు చెప్పించక ఇంట్లోనూ చదివించక, పెండ్లి చెయ్యక, ఇంటిదగ్గర అమ్మతోనూ వుండక......" నా వాక్యం పూర్తవకుండానే మధ్య అందుకున్నాడు రఘునాథరావు.

"ఆమె అమ్మకాదు......"

"అదేమిటి?"

"మీకు తెలియదు, 'రోజా' నా మొదటిభార్యకి పుట్టింది. ప్రమీల నా రెండో భార్య. సంతానం కలుగలేదు" అని వెళ్ళిపోయాడు, నేనేమీ అనే అవకాశం ఇవ్వక, ఇప్పుడర్థమైంది. ప్రమీలకి 'సరోజ' తండ్రితో అంత చనువుగా ఉండడం ఎందుకిష్టం లేదో, తనకేసంతానం ఉండివుంటే 'రోజా' పట్ల కాస్తంత ఆపేక్ష చూపడం సాధ్యమయ్యేది.

సంతానం లేకపోవడం స్త్రీలో పెద్ద లోటంటారు. స్త్రీత్వం పరిపూర్ణత చెందాలంటే, సంతానం ఉండాలంటారు. 'రోజా'ని ప్రేమతో చూడలేదు. భర్త ఆమెపట్ల అంత ప్రేమ చూపడం సహించలేదు. ఆ ప్రేమని 'రోజా' పంచుకుంటుందన్న అనుమానం పెనుభూతమై, పీడిస్తోంది. దీని కొకటే మార్గం. ఏదో సంబంధం చూసి, 'రోజా'కి పెండ్లి చేసి, భర్తతో పంపితే, దంపతులు సుఖంగా వుంటారు. ఈ విషయం ఆఫీసులో ఒకరిద్దరితో అని తరువాత నాకెందుకులే అనుకుని ఆఫీసు వ్యవహారాల్లోపడి ఈ విషయం గురించి పట్టించుకోలేదు నేను.

ప్రమీల అందమైంది. 'రోజా' అంత అందమైంది కాదు, తనకంటె తక్కువ అందంగల యీ పిల్లపట్ల అంత ప్రేమ కనపర్చడం ఆమెకి గిట్టదు. ప్రమీల వయస్సు ముప్ఫయిలోపే, రఘునాధరావుకి నలభైఏడు, నలభయి ఎనిమిది వుంటాయేమో. ఆ వయస్సులో భర్తని శంకించడము అన్యాయమే కాని పురుషుణ్ణి ఎవరు నమ్మగలరు? వయస్సు మళ్ళడంతోటే విపరీతమయిన బుద్ధులు పుడతాయంటారు. పైగా మన సమాజంలో పురుషుడు ఇతర సంబంధము పెట్టుకుంటే అంతగా విరుచుకుపడరు. ఆ పని స్త్రీ చేస్తే విరుచుకుపడతారు. 'రోజా'లో తల్లి పోలికలున్నాయి. 'రోజా' వెనకవున్న తల్లిని ద్వేషిస్తూంది ప్రమీల. భర్తపట్ల ఎంతో ప్రేమ ఆమెకి. కాని వారిరువురి మధ్యా 'రోజా'ని కన్నతల్లి నీడపడింది. గోడలా లేచింది. 'రోజా'లో ఆ మొదటి భార్యనే ఆరాధిస్తున్నాడు భర్త. ఆమె ధ్వంసం అయితేగాని అతనికి విముక్తిలేదు.

రఘునాధరావు మాటేమిటి? 'రోజా' తల్లిని ఎంతగా ప్రేమించాడో! అతని యౌవ్వనాన్ని ఆమె ఎరుగును. ఆనాటి ఉద్రేకానికి జనించిన పుష్పం 'రోజా'. ఆమె ఎదిగింది. అతని యౌవ్వనం సన్నగిల్లింది. ప్రమీల రావడంతో యౌవ్వనాన్ని తెచ్చుకోవాలి. సహజంగా లేదు. ఆ శక్తులింక అతనిలో లేవు. తెచ్చుకోవాలి ఎలా? 'రోజా' సంపర్కం, ఆమె కళ్ళలో కనబడే తల్లి, ఆ తల్లి అతనిలో రగిల్చిన అగ్ని, ఆమె స్నేహం కావాలి. అది కేవలం మానసికంగా వచ్చేదికాదు. ఆమెని తాకాలి. ఒళ్ళోకి తీసుకుని ముద్దాడాలి, జుట్టు నిమరాలి. ఆమె అరచేతిని స్పర్శించి, కౌగిట్లో ఆమె కంఠాన్ని బిగించి, తల్లినుండి తెచ్చుకున్న అగ్నిలో చలి కాచుకుని, వేడిని తెచ్చుకుని యౌవ్వనుడయిన భ్రాంతిని ప్రమీలతో ఋజువు చేసుకోవాలి. అందుకే 'రోజా' ని వదలలేడు. రఘునాధరావుకు, ప్రమీలకు సంతానం కలిగే మార్గం ఏమిటి?

ఏమిటో, నాకెందుకిదంతా, నాదంతా ఊహాగానమే. మానవ ప్రకృతిని గురించి నాకేం తెలుసు? నన్ను గురించి నాకేం తెలుసు? పురుషుడికి ప్రేమ కావాలని ఎరుగుదును. మా వీధి చివర కిళ్ళీకొట్టువాడెరుగును. ఇవ్వలేనప్పుడు, మరీ కావాలి– మరీ కావాల్సి రావడమే వయసు మళ్ళిన పురుషుడిలో విషాదఛాయ అని మాత్రం ఎరుగుదునేమో.

మరో ఏడాది గడిచాక విన్నాను. రఘునాధరావు కూతురికి సంబంధాలు చూడ్డం సాగించాడని. ఆ యత్నాలు ఫలించాయట. కుర్రవాడి వయస్సు ఇరవయి రెండు. ఎమ్. ఎస్.సి. చదువుతున్నాడట. మంచి కుటుంబమట, జాతకాలు చూపించారు. అన్నీ సక్రమంగా వున్నాయన్నారట. బాగుందనుకున్నాను. రఘునాధరావు శెలవుచీటి ఎప్పుడు పంపుతాడా, ఆ పనిలో ఎవర్ని పెడదామా అని ఆలోచిస్తుండగానే మరో వార్త విన్నాను. పెళ్ళి యత్నాలు విరమించారట. ఆ పెళ్ళి చేస్తే విషం తాగి చస్తానందట ప్రమీల. ప్రమీల మనస్తత్వం ఆలోచనకు లొంగడంలేదు. ఆలోచించినకొద్దీ, వింతవింత

లోతులకు దిగ(బ్రాకుతోంది. ఆ సంబంధము తిరకాసేమిటో చెప్పదట. మళ్ళా అసలు పెళ్ళే వద్దనడము లేదట మరో సంబంధం చెప్పాడట. కుర్రవాడికి పందొమ్మిదోయేడు, ఒక్కడే కొడుకు. బి.కాం. చదువుతున్నాడు. ఆస్థికూడా వుందట. పెళ్ళాం అలాగే అంటుందిలే ఫరవాలేదు. ఈ సంబంధమే చేసెయ్యమని నలుగురూ ఒత్తిడి చేశారట. రఘునాథరావు ఊ అన్నాడు. తాంబూలాలు పుచ్చుకోడం తథ్యమని ప్రమీలతో చెప్పగానే, ఆమె రెచ్చిపోయి ఆ రాత్రంతా ఏదో మాట్లాడుతూ నిద్రపోలేదట.

ఆ మర్నాడు కూడా అదే వాగుడట- పెద్ద, చిన్న, వెనక, ముందు, అదీ, ఇదీ, వాడు పెద్ద, అది చిన్న, నువ్వు చిన్న, నేను పెద్ద- వెనక ముందు, ముందే వెనక- ఈ విధంగా మాట్లాడుతుందిట ప్రమీల. ఆ సాయంత్రానికి ఆమె మతిభ్రమించిందని ఖాయం చేశారు చుట్టుప్రక్కలవాళ్ళు. సందేహంలేదు. ఆమెకు పిచ్చెత్తింది. రఘునాథరావు పెళ్ళి ప్రయత్నం విరమించానని, ఇప్పుడు ఏ సంబంధం చూడబోవడము లేదనీ, ఎన్నోమార్లు చెప్పాడట ప్రమీలతో. కాని ప్రమీల పిచ్చి ధోరణి ఆగలేదు. తగ్గలేదు. వైద్యుల్ని రప్పించి మంత్రాలు చెప్పిస్తున్నారు. తోచినవారి చిట్కాలు యత్నిస్తున్నారు. డాక్టర్ని రప్పించారు. నిద్రపట్టే ఇంజక్షను ఇచ్చి బెంగుళూరో, విశాఖపట్నమో తీసుకువెళ్ళి అక్కడి డాక్టర్ల సలహా పొందమని చెప్పి వెళ్ళాడుట. ఆ డాక్టరు రఘునాథరావు ఓ నెల శెలవు పెట్టి భార్యని చూస్తూ వైద్యం చేయిస్తూ ఇంటిదగ్గరే వుంటున్నాడు.

ఈ విషయం నా భార్యతో చెప్పి, ఆమె ఏం చెపుతుందో విని ఓ మారు ప్రమీలను చూసివద్దామా అనుకుంటుండగానే డాక్టర్ కార్ దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. శెలవులలో దక్షిణదేశ యాత్ర ముగించుకుని బొంబాయి తిరిగి వెడుతూ ఒకపూట ఇక్కడ దిగి, నన్ను చూసి వెడదామనుకుంటున్నట్లు వ్రాశాడు. తప్పకుండా దిగవల్సిందిగా కోరుతూ టెలిగ్రాం పంపించాను.

మూడోనాడు దిగాడు డాక్టర్ కార్. మేం కలుసుకుని అప్పుడే ఆరేళ్ళయింది. ఎప్పుడన్నా కథలూ, కార్యాలూ జరిగినప్పుడు ఆహ్వానాలు పంపుకోవడం తప్ప, మా స్నేహం గాఢంగా కొనసాగే అవకాశాలు చాలా తక్కువ. మనిషి చాలా మారాడు. ప్యాంటు, కోటు, టై కళ్ళకి జోడు- పై దేశం నుండి అప్పుడే వచ్చిన ఉన్నతోద్యోగి వేషం వైఖరి. ఇంట్లో కూడా పాంటు- పాంటులో షర్టు-సంభాషణంతా ఇంగ్లీష్‌లోనే. మా ఆవిడతోనూ ఇంగ్లీషే. ఆమెకి ఇంగ్లీషు అంత బాగా రాదని తెలియకకాదు అలవాటయిపోయింది. ఇంగ్లీషులో మొదలెట్టి నాలుక కరుచుకుని తెలుగులోకి దిగి క్షణంలో ఇంగ్లీషులోకి జారిపోతాడు డాక్టర్ కార్. "ఏరా ఆచారి!- ఇంట్లో ఇంగ్లీషు ఎందుకోయ్!" అంటే కోపం వచ్చిందేమో కూడా.

నౌకరు ఏదన్నా కావలసింది తెచ్చి ముందు వుంచితే 'థాంక్స్' అంటాడు. వాడికి నవ్వు. అందరం నవ్వుకోవటంతో ఆరోజు గడిచిపోయింది. రాత్రి షికారుకి తీసికెళ్ళి ప్రమీల కథంతా చెప్పి ఉదయం వెళ్ళి ఆమెను పరీక్షచేసి, యేమన్నా చెయ్యగలిగితే మంచిదని చెప్పాను. అంతా విన్నాడు చూసి చెపుతానన్నాడు. మనస్సులో 'లిబిడో' అని ఒక అంతస్తు వుంటుందట. అందులో, తీరని వాంఛలు బోనులో అడవి మృగాలకి మల్లె గర్జిస్తుంటాయట. ప్రమీల 'లిబిడో'లో యేముందో తెలిస్తే, ప్రమీల జీవితంలో తిరకాసేమిటో చెప్తానంటూ, లిబిడో అధోలోకం మీద గంట లెక్చరిచ్చాడు. ఇంగ్లీష్‌లో దాన్నిండా సైకాలజీకి సంబంధించిన మాటలు వాడడం వల్ల నాకు విషయం పూర్తిగా తెలియకపోయినా తెలిసినట్లు నేనూ మా ఆవిడకూడా తలూపాం.

మర్నాడు ఉదయం రఘునాధరావుకి కబురుచేసి, 'కార్'ని అతనితో పంపించాను. ఎవ్వరూ కూడా వద్దంటే నేనూ మానేశాను. అతను వెళ్ళేముందు చెప్పాను. ప్రమీలకి ఇంగ్లీషు రాదుగనుక సంభాషణ తెలుగులో కొనసాగించాలనీ. ఆమె చాలా అందమయింది నా దృష్టిలో– తదనుగుణ్యంగా తను ప్రశ్నలు అడగాలనీ సూచించి పంపాను. అతని పరీక్ష పూర్తయ్యేసరికి సాయంత్రం నాలుగయింది. మధ్యాహ్నం అక్కడే భోజనము చేశాడు. జరిగినదంతా ఆ రాత్రి చెప్పాడు మాతో.

అతను వెళ్ళగానే నువ్వు ముందొచ్చావా? వెనకొచ్చావా? అని అడిగినదట. 'ముందే' అన్నాడుట. "అయితే ఫరవాలేదు నేను వెనకే లెండి" అందట. వికటంగా నవ్వింది.

"మీరు చాలా అందమయినవారు" అన్నాడుట కార్. ప్రమీల కరిగిపోయిందిట. "నువ్వు అలా అనకూడదేమో" అన్నాను నేను. కార్‌కి కోపం వచ్చింది– ఇంగ్లీషులో మొదలెట్టాడు. మా సంభాషణ సారాంశం పొందుపరుస్తాను నా పొడిమాటలలో.

"ఇదే మన దేశంలో పేచీ– వ్యక్తి గౌరవం లేదు, పైగా ప్రజాస్వామ్యం మాది అంటారు. ఇంగ్లండ్, అమెరికాలలో మీరీ పూట అందంగా కనబడుతున్నారు అంటూ పరామర్శిస్తారు. తెల్లారగట్ల రాత్రి పరుండేముందు, "మంచి కలలు వచ్చుగాక" అని దీవించి, భర్త భార్యని ముద్దెట్టుకుంటాడు. లోనున్న ప్రేమను బహిర్గతం చేస్తారు. మనం చెయ్యం. ఇహపరలోకాలని ముంచెత్తివేసి ప్రేమ సముద్రం ఉప్పొంగుతున్నా చిరచిరలాడే మొహంతో, "ఈ గదిలో ఈ చెత్తంతా ఏమిటే?" అని భార్యని చీదరించుకుంటాడు భర్త. ఆ విధంగా ప్రేమ పైకి చూపక దూరమయిపోతారు. మీరు చాలా అందమయిన వారనగానే ప్రమీల మైనంలా కరిగి, నేనేది చెప్తే అది చేసింది. కళ్ళు మూసుకోమంటే మూసుకుంది. ట్రాన్సులో పడవేశాను. మైకంలో పడింది– గతంలోకి యాత్ర చేసింది. బాల్యంనాటి ముచ్చటలన్నీ చెప్పమన్నాను. తొమ్మిదోయేట ఆరోయేట– నాలుగోయేట జరిగినవి. అమ్మా నాన్నా తనని ఎలా చూసేది అన్నాతమ్ములు తనని ఆదరించేవారా? ఎవరితో ఎలాటి ఆటలు ఆడే దానివి! అని అడిగాక చెప్పడం మొదలెట్టింది. నాలుగో ఏడు ముందు జరిగినవి ఆమెకు జ్ఞాపకం రాలేదు. అక్కచెల్లెళ్ళను గురించి అడిగితే ఆమె మాట్లాడడం మానేసింది. ఏదో మనసులో 'బ్రేక్' పడ్డట్టు. అక్కలెందరు? చెల్లెళ్ళున్నారా? అవే ప్రశ్నలు, సమాధానం లేదు. 'చెప్పు అక్కా' అన్నాను. మాటలేదు. "ఏం చెప్పవు? మా చెల్లాయివికా– చెప్పు" చెల్లాయి అనగానే కళ్ళు తెరిచింది. లేచి కూర్చోబోయింది. లేవకుండా దిండ్లమీద తల ఆనించి పడుకోబెట్టా ఏం చెల్లీ ఇప్పుడు బాగుందా? లేవకు చెల్లీ కూర్చున్నప్పుడు ఎంత అందంగా వుంటావో పడుకున్నప్పుడు అంత అందంగా ఉంటావు చెల్లాయీ" అన్నాను. సర్దుకొని మళ్ళా మాట్లాడడం ప్రారంభించింది. ప్రమీల విషయం ఇది. ప్రమీల, కాంతం కవల పిల్లలట. ప్రమీల ముందుపుట్టిందట. తర్వాత కాంతం పుట్టిందట– ప్రమీల కాంతం కంటె పెద్దదని నిర్ణయం జరిగింది. కాంతం ప్రమీలని "అక్కయ్యా అని పిలుస్తూంది. అందరూ అక్కయ్యా అని పిలిచేవారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మంచి బట్టలు, బిస్కట్లు, టపాకాయలు గుర్రం బండిమీద ఎక్కించి తిప్పడాలు, పడవ షికార్లు ఇవన్నీ కాంతానికి ఎక్కువగా జరిగేవి. ప్రమీలకి కాంతంపట్ల అసూయ ప్రబలింది, ప్రమీల అందమైంది– కాంతం అంత అందమైంది కాదు. కాని ఆమె చిన్నది కావడంవల్ల ముద్దు చెయ్యడాలూ,

గారం చెయ్యడం- కాంతానికే ఎక్కువ జరిగేవి. ఆమె సౌందర్యాన్ని, వ్యక్తిత్వాన్నీ తన వెనుక- ఎంత వెనుక? ఐదో, పదో నిమిషాలు వెనుక పుట్టిన కాంతం తుడిచివేస్తుంది. ఆ బాధని దిగమింగినది ప్రమీల. అధోలోకంలోకి- "లిబిడో"కి నెట్టి వేసింది. పెళ్ళయింది. వెనక పుట్టిన కాంతం- ఎప్పుడూ తనకంటె చిన్నదే- తనకంటె యౌవ్వనురాలు. యౌవ్వనముతోపాటు అందం, సౌందర్యము, యౌవ్వనంతో ముడిపడి వుంది కనుక, కాంతం తన కంటె అందమైందని, యౌవ్వనవతి అనీ- లోకము భ్రమిస్తుంది. అది అబద్ధం, అన్యాయం, అక్రమం, ఇదీ నే వెళ్ళగానే, "ముందా వెనకా?" అడగడంలో అంతర్యం. "నే వెనకే లెండి" అని సమాధానం కుదుర్చుకుంది ప్రమీల. మైకంలో వుండగానే, తనే వెనక పుట్టిందని కాంతం ముందు పుట్టిందనీ, పెద్దలు పొరబడ్డారనీ, వెనక పుట్టినవారే, ముందు పుట్టినవారికంటె తెలివిగలిగి, అందమైనవారై వుంటారనీ- అది పరిణామవాదం ఋజువు చేసిన సూత్రమని నచ్చజెప్పాను. మొదటి వారికంటె తరువాత కలిగిన సంతానం బలహీనులై వుంటారు. అది సృష్టి వైచిత్రం. ఆ బలహీనత, భౌతికం, కేవలం శారీరకం. ఆ కొరతను పూడ్చే నిమిత్తం, తరువాత పుట్టిన వారికి సృష్టి ఒక ఆయుధాన్నిస్తుంది. సౌందర్యమో, తెలివో లేక రెండూనో.

నిస్సందేహంగా నువ్వు కాంతంకంటె చక్కనిదానవు, తెలివయిన దానవు- కాంతం బలమైనది. కాబట్టి, ఆమె ముందు జనించినది- నువ్వు తరువాత. కాంతం నీ అక్క నువ్వే ముద్దులుగొలిపే చెల్లాయివి. ఈ ధోరణిలో గంటసేపు డ్రిల్లుచేసినట్లు చెప్పిందే చెప్పి- పదేపదే చెప్పి- ఆ చెప్పింది ఆమె అధోలోకంలో నాటుకుపొయ్యేటట్టు భర్తచేత కూడా చెప్పించాక ఆమె మనోవికారం సడలింది."

అన్నాడా డాక్టర్ కార్.

"ఇంతకీ-దీనికీ 'రోజా' పట్ల ద్వేషానికీ ఏం సంబంధం?" అని అడిగాను.

"రోజా- తన కూతురుకాదు. చనిపోయిన సవతి కూతురు. తన కంటె చిన్నది కాబట్టి యౌవ్వనురాలు అందుకనే భర్తకు ఆ పిల్లంటే చాపల్యం. తనకంటె వెనక పుట్టినవాళ్ళు తన మీదినుండి దాటి ముందుకు పోతున్నారన్నదే ఆమె బాధ. భర్త తనకంటె ముందువాడు బాగాముందు. కాబట్టి భర్తంటే ఆమెకి అపారమైన ప్రేమ. 'రోజా' తనకంటె బాగా వెనక- భర్తపట్ల ఎంత అనురాగముందో 'రోజా' పట్ల అంత అసూయ చూపింది. కాంతం దగ్గర్లో లేదు గనక ద్వేషం ప్రకటించవల్సిన వ్యక్తి తన ముందుండాలి. పెండ్లిచేసి పంపించివెయ్యకూడదు."

కాసేపు మౌనంలో పడ్డాం. కాని నాలో ఇంకా ఒకటి రెండు శంకలు లేకపోలేదు. సిద్ధాంతాలు వేరు, ప్రత్యక్షంగా మనోవ్యాధిని కుదర్చటం వేరు. సిద్ధాంతంగా మనకి కార్ చెప్పింది సబబుగానే తోచొచ్చు కాని పర్యవసానం ఏమిటి?

"రోజా పెండ్లి చేసుకోకుండా తనముందే వుంటే ఆమె ద్వేషిస్తూ సుముఖంగా వుంటుంది. అంతేనా ముందు మరో మార్గం లేదా?" అని అడిగాను కార్‌ని.

"ఎప్పుడైతే అధోలోకంలో దాగిన ఆ భావాన్ని బైటికి లాగి ప్రకటించిందో అప్పటితో ఆమెలో ద్వేషం తొలగిపోయింది. తెలియనపుడే మానవుడు భయపడేది. మృత్యువు ఎలాంటిదో తెలియక భయం. చీకట్లో ఏముందో తెలియక భయం. కాంతంపట్ల వున్న ద్వేషాన్ని, 'రోజా'వైపు ఫిరాయించక రోజా అంటే భయం. తెలుసుకున్నాక ఆ భయం పటాపంచలై పోతుంది. అధోలోకం శోధించి అక్కడున్న ద్వేషాన్ని తొలగించుకుంది

ప్రమీల. ఆమె చెల్లాయి కావడమే ఆమెకి కావాల్సింది. అది నిర్ధారణ అవగానే సుఖంగా, ప్రశాంతంగా వుంది. చెల్లాయి అవడంలో ఎంతో ప్రయోజనం వుంది. వైధవ్యం ప్రాప్తిస్తే కాంతానికే ముందు ప్రాప్తిస్తుంది. తనకంటే ముందే చనిపోతుంది. సృష్టి సమరంలో ముందు కూలే యోధురాలు కాంతం. తానింకా నిలబడే వుంటుంది" అని ముగించాడు డాక్టర్ కార్.

"ఇదంతా బాగానే ఉందయ్యా. సరోజ విషయం ఏం చెయ్యాలి?" అని అడిగాను.

"రోజా'కి పెండ్లి చెయ్యాలి" అన్నాడు.

"అది వల్లకాదంటుందిగా ప్రమీల!"

"రోజా' ని 'రోజా' కంటె వయస్సులో చిన్నైన వాడికిచ్చి పెండ్లి చెయ్యాలి" అన్నాడు డాక్టర్.

"వరహీనం కాదూ!" అంది మా ఆవిడ.

"మరో మార్గంలేదు. ఏ సంబంధం తెచ్చినా ఆ సంబంధం వద్దంటోంది. కాని, ప్రమీల అసలు పెండ్లి వద్దనడంలేదు. తను ఎదుర్కోలేని శక్తితో పెనుగులాడుతోంది. ఆమె చెప్పలేదు. అలా జరిగితే ఆమె మనస్సులో ఇంక ద్వంద్వాల సంఘర్షణ వుండదు. 'రోజా' కంటే చిన్నవాడికిచ్చి చెయ్యాలి."

"ఎంత చిన్న?"

"ఏడాదీ, గంట- ఒక్క నిమిషమైనా సరే చిన్న కావాలి. కాంతం, ప్రమీల కవలలు, ఒకరి తరువాత ఒకరు పుట్టడంలో ఎంతటి ముందు వెనకలున్నాయో అంత తారతమ్యం, వ్యత్యాసం ఉంటే చాలు. అసలు రహస్యం చెప్పనా? నిజానికి ముందు పుట్టినా కాంతంకంటే ప్రమీలే చిన్న. ఎలాగో తెలుసా? తల్లి గర్భంలో బీజంగా ముందు పడింది కాంతం, తరవాత పడింది ప్రమీల. కాని జన్మించడంలో ముందు జన్మించింది ప్రమీల. శాస్త్రరీత్యా కాంతం పెద్ద. ప్రమీల చిన్న" అని ముగించాడు డాక్టర్ కార్.

రెండు నెల్లకి శెలవుచీటి పంపాడు రఘునాధరావు. అమ్మాయి పెండ్లికని ఆహ్వానం వచ్చింది. సంబంధం స్థిరపరిచారు వరుడు. వధువు కంటె ఏడాది చిన్న. మన సమాజంలో జరగని వింత జరిగింది. ప్రమీల ఆ వివాహానికి వప్పుకుంది. ఇప్పుడు మామూలుగా 'రోజా' పట్ల ఆపేక్ష చూపుతోంది. దంపతులు అన్యోన్యంగా ఉంటున్నారు. ఆ సంసారం చక్కబడింది. నేను సంబరపడ్డాను. వారికి మేలు చెయ్యగలిగాను కదా అనుకుని గర్వపడ్డాను కూడ.

"కాని, చిత్రం పెండ్లికొడుకు తల్లిదండ్రులు ఎలా వప్పుకున్నారో అబ్బాయికంటె పెద్దదయిన పిల్లని పెండ్లి చేసుకోడానికి చిత్రం!" అన్నాను. రఘునాధరావుతో అతను నవ్వాడు.

"భలేవాడివే. ఎలా సాధించావయ్యా?" అన్నాను.

"అబ్బాయి, 'రోజా' కంటె రెండేళ్ళు పెద్దేనండి. చిన్నవాడైనట్లు జాతకాలు, చిట్టాలు సృష్టించాం ప్రమీలని సంతోషపెట్టడానికి" అన్నాడు.

"ఓర్నీ ! చాలా తెలివైన పనిచేశావు, రఘు రేపటి మార్చితో నీ ఇంక్రిమెంట్ వస్తోంది. ప్రమోషన్‌కి కూడా సిద్ధపడు" అన్నాను.

"అవునండి. ఇంక్రిమెంట్, ప్రమోషన్లు కవలలు, ప్రమోషన్ ముందు, వెనక ఇంక్రిమెంట్."

రఘునాదంతోబాటు నేనూ నవ్వేశాను, కాసేపు పెద్ద ఉద్యోగిహోదా తాలూకు గాంభీర్యాన్ని అధోలోకంలోకి నెట్టివేసి.

***